క్లుప్తంగా

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు



జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో అయ్యప్ప స్వాములు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నాయినపల్లె, పెట్నికోట గ్రామాలకు చెందిన 20 మంది అయ్యప్ప స్వాములు సోమవారం శబరిమలకు తరలివెళ్లారు. ముందుగా పెట్నికోటలోని గుండు మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు స్వీకరించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. 41 రోజుల కఠిన దీక్ష చేసిన అయ్యప్ప దీక్షా పరులకు స్వామి ఆశీస్సులు లభించాలని జెడ్పీ చైర్మన్ ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి పోటీలకు డోన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: త్వరలో జరగబోయే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పట్టణానికి చెందిన శ్రీసుధ స్కూల్ 9వ తరగతి విద్యార్థులు ఆర్.రవిశంకర్‌నాయుడు, కె.అశ్విని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అహమ్మద్ నవాజ్ తెలిపారు. సోమవారం స్కూల్ ఆవరణంలో వైస్ ప్రిన్సిపాల్ రంజన్‌తో కలిసి ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అక్టోబరులో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

అటవీశాఖ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్: అటవీ రేంజ్ అధికారుల సంఘం నూతన సర్కిల్ బాడీలో డోన్‌కు చెందిన అటవీశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్‌ను ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈనెల 17న పచ్చర్ల సీబీటీలో జరిగిన అటవీశాఖ అధికారుల సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్‌కు బీట్ ఆఫీసర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆర్టీసీని ఆదరించాలి



బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ తిరుపతయ్య

కోవెలకుంట్ల: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థను ఆదరించాలని స్థానిక డిపో మేనేజర్ తిరుపతయ్య కోరారు. కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ రూట్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని ప్రోత్సహిస్తూ గిఫ్ట్‌స్కీం ఏర్పాటు చేశారు. డిసెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రయాణాలకు సంబంధించి సోమవారం బస్టాండ్‌లో లక్కీడిప్ నిర్వహించారు. లాటరీలో ఆళ్లగడ్డకు చెందిన చెన్నకేశ్వరికి ప్రథమ, కోవెలకుంట్లకు చెందిన గిరిప్రసాద్‌కు ద్వితీయ, దొర్నిపాడుకు చెందిన ఉసేన్‌బాషాకు తృతీయ బహుమతి దక్కింది.

న్యాయవాదుల రిలే నిరాహారదీక్ష



దీక్షను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి

డోన్: స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన న్యాయవాదుల రిలే నిరాహారదీక్షను సోమవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 512 భూహక్కు చట్టం మూలంగా కోర్టులు నిర్వీర్యమై, న్యాయవాదులు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శివరామక్రిష్ణ, కార్యదర్శి శేషయనరావు, సహాయ కార్యదర్శి బాలరంగడు, ట్రెజరీ మంగమూరి శ్రీను, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు గోవిందుని కల్యాణం

డోన్: స్థానిక వెంకటేశ్వర ఆలయంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి గోవింద మాలధారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం మాలధారులతో పాటు మహిళా భక్తులు వేకువజామునే నారాయణ పారాయణం పఠించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, ధర్మకర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి అదరహో!

సంజామల మండలంలో అభివృద్ధి ఉరకలేస్తోంది. నాలుగున్నరేళ్ల కాలంలో దాదాపు రూ.వంద కోట్లకు పైగా వెచ్చించి మండల వాసుల మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా పలు గ్రామాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకోగా, మరికొన్ని చివరి దశకు చేరుకున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగు నీటి పథకాల నిర్మాణాలను చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సంజామలలో పూర్తైన డ్రైనేజీ నిర్మాణం

- చురుగ్గా సాగుతున్న పనులు
- ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సంజామల: కుల, మత, రాజకీయాలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. సంక్షేమ ఫలాలకు ఏ ఒక్కరూ దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులను గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించి సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. అందులో భాగంగానే బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మండలంలో ప్రతి గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు చేరుతున్నాయో లేదో తెలుసుకుంటున్నారు. స్థానికులు లేవనెత్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అంచనాలు రూపొందించి, నిధులు విడుదల చేయించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తున్నారు.



గిద్దలూరు గ్రామంలో వేగంగా సాగుతున్న కల్వర్టు



పేరుసోముల గ్రామంలో పూరైన సీసీ రోడ్డు

అభివృద్ధి పనుల్లో కొన్ని..

- మండల వ్యాప్తంగా సీసీ రోడ్లకు రూ.2 కోట్లు ఖర్చు చేశారు.
- జల్‌జీవన్ పథకం కింద శ్వాశత తాగు నీటి సమస్యల పరిష్కారానికి రూ.11 కోట్లు మంజూరు కాగా రూ.5 కోట్ల విలువ చేసే పనులు పూర్తయ్యాయి. మిగిలిన రూ.6 కోట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- సంజామల, బొందలదిన్నె గ్రామాల్లో దాదాపు రూ.1 కోటితో డ్రైనేజీ పనులు సాగుతున్నాయి.

సమస్యలు పరిష్కరిస్తున్నాం



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడే అధికారులను ఆదేశిస్తున్నారు. అంతటితో ఆగక పనులు పూర్తయ్యేంత వరకు పర్యవేక్షణ చేస్తుండటంతో త్వరగా సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. తాగు నీరు సమస్యలను పరిష్కరించాం. – ఎంపీపీ పోచ రమాదేవి, సంజామల మండలం.

రోడ్లు వేశారు



మా ఇంటి ముందు సీసీ రోడ్డు లేక మురుగు నీళ్లతో ఆగి ఇబ్బంది పడేవాళ్లం. గతంలో మా ఇంటి ముందర సీసీ రోడ్డు వేయమని అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. కొన్నాళ్ల క్రితం ఎమ్మెల్యే వచ్చినప్పుడు రోడ్డు కావాలని అడిగినాం. ఆయన వేయిస్తానని చెప్పాడు. రూ.15 లక్షలతో సీసీ రోడ్డు వేయించారు. మా ఇంటి ముందర ఇప్పుడు మురుగు నీళ్లు ఆగడం లేదు. సమస్య తీర్చినందుకు సంతోషంగా ఉంది. – ఈడిగ లక్ష్మిదేవి, పేరుసోముల

పనులు పూర్తి చేస్తున్నాం

మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరవుతున్నాయి. వాటితో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి ఏర్పాట్లకు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటి వరకు చాలా పనులు పూర్తయ్యాయి. మిగతా సమస్యలను కూడా త్వరగా పరిష్కరిస్తాం. – నాగ కుమార్, ఎంపీడీఓ,సంజామల

బడుగుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: బడుగు ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం రాంభూపాల్‌నగర్‌లో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ఆప్యాయంగా పలకరించారు. పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇంటి స్థలాలు కావాలని పలువురు కోరగా.. పట్టణంలో మూడువేల మందికి పైగా అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏడాది క్రితమే చర్యలు తీసుకున్నామని, టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని వివరించారు. త్వరలోనే కోర్టు ద్వారా సమస్య పరిష్కారమవుతుందని, ఆ వెంటనే ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాలకు మేలు చేయాలనే ఆలోచన ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌లాంటి వారు దొరకరని, అలాంటి నాయకుడిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీటీ వెంకటామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డు అధ్యక్షురాలు దీవెనమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటసుబ్బయ్య, భానుముక్కల సహకారం సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు యల్లయ్య, ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, పీఆర్ ఏఈ మహేష్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఈఓ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

బేతంచెర్ల: క్రమశిక్షణతోనే తైక్వాండో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కర్నూలు జిల్లా అమెచూర్ తైక్వాండో సెక్రటరీ మాస్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన తైక్వాండో బెల్ట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్‌బెల్ట్ థర్డ్ వెంకటేశ్వర్లు, కోచ్ నాగన్న పాల్గొన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

కొలిమిగుండ్ల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 50 అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ సాయికృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో తెరిపించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం వారం రోజుల నుంచి సమ్మెలోకి వెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తెరిపించారు.

– **కోవెలకుంట్ల:** వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరవధిక సమ్మెలోకి వెళ్లడంతో ఈనెల 12 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. పూర్వప్రాథమిక విద్యకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్‌డీ రాధిక, మేజర్ పంచా యతీ ఈఓ గోపీనాథ్ మండలంలోని ఆయా గ్రామా ల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయినీలు, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బందితో కేంద్రాల్లో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు.



కొలిమిగుండ్లలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద చర్చిస్తున్న అధికారులు

ఉప్పలపాడులో మొదలైన జాతర

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న ఉడుములపాడు గ్రామంలో జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పెద్దమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, యల్లమ్మ, సుంకుల మ్మ దేవతలకు గ్రామస్తులు జాతర మహోత్సవాలను నిర్వహించుకుంటున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవార్ల ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవా రం సామూహిక బోనాల ఊరేగింపు ఉంటుందని సర్పంచ్ ఉప్పరి రాధమ్మ తెలిపారు. బంధువులు, స్నేహితులతో గ్రామంలో సందడి నెలకొంది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐలు శరత్ కుమారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.



విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం

నేడు మండలంలో మంత్రి బుగ్గన పర్యటన

డోన్: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నట్లు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు రేగటి అర్జున్‌రెడ్డి, కళ్యాణి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కన్నపకుంట గ్రామం నుంచి కమలాపురం వరకు రూ.3 కోట్లతో నిర్మించిన 2 కిలోమీటర్ల రోడ్డును మంత్రి ప్రారంభించనున్నారన్నారు. అదే రోడ్డుపై పాదయాత్ర చేసి, కమలాపురం గ్రామంలో రూ.35.5 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.25.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్ర భవనాలను ప్రారంభిస్తారన్నారు.

రేపు మండలమీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే మండల మీట్‌కు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి హాజరవుతారన్నారు. ప్రగతి నివేదికలతో హాజరు కావాలని అధికారులకు సూచించారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయాలి

కొలిమిగుండ్ల: దివ్యాంగుల కోసం క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన ఉపకరణాలు అందజేయాలని దివ్యాంగుల జాతీయ హక్కుల వేదిక మండల అధ్యక్షుడు మద్దిలేటిరెడ్డి కోరారు. సోమవారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని కోరారు.

ప్యాపిలి టు విజయవాడ బస్సు సర్వీసు ప్రారంభం

ప్యాపిలి: మండల కేంద్రం నుంచి డోన్, కర్నూలు మీదుగా విజయవాడకు బస్సు సర్వీసును గురువారం రాత్రి డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ ప్రారంభించారు. ప్రతి రోజూ రాత్రి 7 గంటలకు ప్యాపిలి నుంచి విజయవాడ వరకు ఈ సర్వీసు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 8:45 గంటలకు విజయవాడ నుంచి డోన్ వరకు బస్సు సర్వీసు ఉంటుందన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డీఎం తెలిపారు.

గుడిపాడులో అగ్నిప్రమాదం

ప్యాపిలి: మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లింగన్న ఇంటిలో ఫ్రిడ్జ్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పేలిపోయింది. ఈక్రమంలో మంటలు వ్యాప్తి చెంది ఇంట్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. మట్టి మిద్దె కావడంతో పైకప్పు తీర్లు (కట్టెలు) కాలిపోయి కూలింది. ఇంట్లో ఉన్న రూ.40 వేలనగదు, మూడు తులాల బంగారు నగలు, తిండి గింజలు, దుస్తులు, విలువైన డాక్యుమెంట్లు కాలిపోయాయి. రూ.4 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సమాచారం తెలుసుకున్న డోన్ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలు ఆర్పారు.

ట్రాక్టరు ఢీకొని వ్యక్తికి గాయాలు

డోన్ టౌన్: మండలంలోని ఉడుములపాడు గ్రామంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని కొండపేటకు చెందిన రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. రాముడు మోటార్ బైక్‌పై కర్నూలు వైపు నుంచి డోన్ వైపు వస్తుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో బ్రిడ్జిపై వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాముడిని స్థానికులు 108లో డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కర్నూలు తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ నిలుపకుండా వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

టీటీడీ తరహాలో మద్దిలేటయ్య క్షేత్రాభివృద్ధి



అభివృద్ధి పనులపై అధికారులు, ఈఓతో చర్చిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకున్నారు. వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కల్యాణ చక్రవర్తి మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు, పాలక మండలి సభ్యులతో కలసి క్షేత్ర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో లోపల భాగన ఒక వరుసలో శిల్పాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆలయ ఆవరణంలో రూ.12.70 కోట్లతో చేపట్టే మహాప్రకారం, మంటపం, 3 రాజగోపురాలు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూ.6 కోట్లతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టే అతిథి గృహం, యాంఫ్లిథియేటర్, 2 ఎకరాల్లో చేపట్టే పార్కు పనులను ప్రారంభించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈశ్వరయ్య, ఈఓ పాండురంగారెడ్డిని ఆదేశించారు. ఆలయం చుట్టు కొండల మధ్య లైటింగ్ ఏర్పాటు చేస్తే ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.50 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేపట్టినట్లు మంత్రి బుగ్గన తెలిపారు. మంత్రి వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మురళీ కృష్ణ, నారాయణ, వెంగలరెడ్డి, ఆకుల రమణ, పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు పాల్గొన్నారు.

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా కార్యదర్శి సురేష్ పట్టణంలోని మంత్రి బుగ్గన స్వగృహంలో సోమవారం కలిశారు. ఈసందర్భంగా మంత్రి బుగ్గన జిల్లా కార్యదర్శిగా ఎన్నికై న సురేష్‌ను అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగులు రామక్రిష్ణారెడ్డి, సునీల్, శ్రీనివాసులు, పురుషోత్తం రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.
- బైటిపేటలో వెలసిన మౌలాలీ స్వామి దర్గాను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాత్రి దర్శించుకున్నారు. అనంతరం కాలనీవాసులు మంత్రి బుగ్గనను సత్కరించారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు అబ్దుల్లా, బషీర్, నడిపి హుసేన్, గ్రిల్ వలి పాల్గొన్నారు.

చివరి దశకు వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో ఓహెచ్ ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామస్తుల తాగు నీటి సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జల్‌జీవన్ పథకం కింద 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం ట్యాంక్ ఏర్పాటుకు రూ.35 లక్షలు మంజూరు చేయించారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో నెల రోజుల్లో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తామని ఆర్.లింగందిన్నె సచివాలయ కన్వీనర్ అన్నె శివరామిరెడ్డి, సర్పంచ్ అన్నెం దేవి తెలిపారు. శ్వాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం అతుండటంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



పూర్తి కావచ్చిన ట్యాంక్ నిర్మాణ పనులు

భూ హక్కు వివరాలతో హాజరు కావాలి

కోవెలకుంట్ల: నంద్యాల–జమ్మలమడుగు నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోయే రైతులు భూ హక్కు వివరాలతో హాజరు కావాలని డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం త్రీజీ అవార్డ్ విచారణ ఉందన్నారు. నేషనల్ హైవే 167 కే జాతీయ రహదారి విస్తరణలో రేవనూరు గ్రామానికి సంబంధించి 15.08 ఎకరాలు, ఎం.ఉప్పలూరులో 8.9, కలుగొట్లలో 27.66, జోళదరాశిలో 28.55, చింతకుంట్లలో 20.66, కోవెలకుంట్లలో 39.66, పాట్టిపాడులో 11.77, గుళ్లదూర్తిలో 42.63 ఎకరాల్లో రైతుల భూములు, స్థలాలు, ఇళ్లు, తదితర ఆస్తులు కోల్పోతున్నారని పబ్లిక్ ప్రకటన ద్వారా తెలియజేశామన్నారు. రైతులు ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, వన్‌బీ, ఈసీ, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, తదితర వివరాలతోపాటు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పుష్పకుమారి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

సంక్షేమ సారథి.. అభివృద్ధి ప్రదాత

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి, అభివృద్ధి ప్రదాత అని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక 16వ సచివాలయ పరిధిలోని 29, 30, 31వ వార్డుల్లో కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మేకల విమల, మీనాక్షిల ఆధ్వర్యంలో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతాంగ సంక్షేమం కోసం, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి చైర్మన్ వివరించి మరోసారి జగనన్ననే ముఖ్యమంత్రి చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, ఎల్లేశ్వర్, పాలుట్ల రఘురాం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

క్రీడా దుస్తుల పంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని సిద్దనగట్టు గ్రామంలో ఎంఎస్ఆర్ రూరల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు హనుమంతరెడ్డి, నాగభూషణ్ రెడ్డిల కుమార్తెలు తనూజ, జాహ్నవిలు రూ.17 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ మాజీ అధ్యక్షురాలు శైలజారెడ్డి, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, క్రీడాకారులు నరసింహులు, పాండు, అంజి, మహేంద్ర, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాదుస్తులు పంపిణీ చేసిన దృశ్యం

భవాని మాలధారుల పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరుతున్న మాలధారులు

డోన్: పట్టణంలోని అంకాలమ్మ ఆలయం నుంచి సోమవారం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి 30 మంది భవాని మాలధారులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పాదయాత్రలో భవాని మాలధారులతో పాటు పలువురు కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.